క్లుప్తంగా

యోగా గ్రాండ్ ఈవెంట్ ఏర్పాట్ల పరిశీలన



భీమేశ్వరాలయంలో యోగా ఈవెంట్ ఏర్పాట్లపై పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ అఖిల

రామచంద్రపురం రూరల్: ఈ నెల 9న ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో నిర్వహించనున్న యోగాసనాల గ్రాండ్ ఈవెంట్‌కు సంబంధించిన ఏర్పాట్లను రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల శుక్రవారం పరిశీలించారు. ఆ ఏర్పాట్ల కోసం ప్రత్యేకంగా విధులు అప్పగించిన అధికారులు పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేసి కార్యక్రమం విజయవంతమయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ నెల 9న సోమవారం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు యోగా గురువులు ఆసనాలు చేయిస్తారని పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని, రామచంద్రపురం ఇన్‌చార్జి తహసీల్దార్ బి.మృత్యుంజయరావు, డీవైఈఓ పి.రామ లక్ష్మణమూర్తి, ఎంఈఓ తాడి వీరరాఘవరెడ్డి, వీఆర్‌ఓ పరంజ్యోతి, సర్వేయర్ సాయిరామ్, ద్రాక్షారామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి ఉత్సవ రథానికి స్వాగతం



ద్రాక్షారామలో సత్యసాయి శత జయంతి రథోత్సవం

రామచంద్రపురం రూరల్: పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవ రథం కపిలేశ్వరపురం మండలం వల్లూరు, టీకి, కె.గంగవరం, వెంకటాయపాలెం గ్రామాల మీదుగా శుక్రవారం ద్రాక్షారామకు చేరుకుంది. అడుగడుగునా ఇళ్ల నుంచి భక్తులు ఎదురొచ్చి హారతులు పట్టారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు అడపా వెంకటేశ్వరరావు, కన్వీనర్లు పి.వర్ధన్‌రావు, నారాయణ రావు, విస్సాప్రగడ కృష్ణమూర్తి, సున్న నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులు ఉత్సవ రథ ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి గ్రామోత్సవం

రాయవరం: మండలంలోని పసలపూడిలో సత్యసాయిబాబా గ్రామోత్సవాన్ని భక్తులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సాయిబాబా చిత్రపటాన్ని ప్రత్యేకంగా తయారు చేసిన రథంపై ఉంచి గ్రామోత్సవాన్ని చేపట్టారు. గ్రామోత్సవం మండలంలోని కుర్మాపురం, వెంటూరు, చెల్లూరు గ్రామాల మీదుగా పసలపూడికి చేరుకుంది. పసలపూడిలో వేంచేసియున్న సత్యసాయిబాబా ఆలయంలో ఆలయ వ్యవస్థాపకుడు కర్రి రామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు బాబా వారికి అడుగడుగునా హారతులిచ్చారు. మహిళా భక్తులు బాబా వారిని కీర్తిస్తూ గీతాలాపనలు చేశారు. కార్యక్రమంలో నల్లమిల్లి మురళీకృష్ణారెడ్డి, కొవ్వూరి శ్రీనివాస రెడ్డి, నల్లమిల్లి విష్ణువర్ధనరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులు, పేదలకు బక్రీద్ తోఫా



వెలంపాలెంలో బక్రీద్ తోఫా అందజేస్తున్న కమిటీ సభ్యులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెం షాబాజియా జామియా మసీదులో మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఫాజిల్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా ఎన్నారైలు షేక్ సనా, షేక్ సారాల సహకారంతో బక్రీద్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మత గురువు ఎండీ దిల్ నవాజ్, మసీదు కమిటీ కార్యదర్శి షేక్ బాబూలాల్, సభ్యులు షేక్ జమాల్ హుస్సేన్, షేక్ హుస్సేన్, షేక్ ఖాదర్, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అర్జీల స్వీకరణ



మండపేటలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం (మండపేట): ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మండపేటలోని క్యాంపు కార్యాలయంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలను సమీక్షించి సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. విద్యుత్, భూ సమస్యలు, తాగునీటి సమస్యలపై అర్జీలను అందినట్టు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు.

అపరాలపై పల్లాకు తెగులు

- చనిపోతున్న మొక్కలు
- రైతుల ఆందోళన
- నివారణకు వ్యవసాయాధికారి సూచనలు



కాజులూరులో పల్లాకు తెగులు సోకిన మినప చేను

కాజులూరు: అపరాల పంటకు పల్లాకు తెగులు సోకటంతో రైతులు ఆందోళనలకు గురవుతున్నారు. తూర్పుడెల్టా కాలువ శివారు భూముల్లో ఉన్న మాగాణి పంటపొలాల్లో రైతులు మూడవ పంటగా రైతులు పెసర, మినుము వంటి అపరాలను పండిస్తుంటారు. ఇటీవల కాలక్రమేణా సాగునీరు విడుదలలో చోటు చేసుకున్న మార్పులతో వరిపంట సాగులో ఆలస్యం, అపరాల పంటపై అంతుచిక్కని తెగుళ్ల కారణంగా అపరాల సాగు తగ్గిపోతూ వస్తుంది. ఈ ఏడాది వరి పంట ముందుగా మాసూళ్లు చేసిన రైతులు అక్కడక్కడా అపరాల పంట సాగు చేశారు. వాతావరణం అనుకూలించక పోవడంతో దాదాపు అన్ని చోట్ల అపరాల పంటకు పల్లాకు తెగులు ఆశిస్తుంది. దీంతో పూత, పిందె లేకుండానే మొక్క పండిపోయి చనిపోతుందని రైతులు వాపోతున్నారు. అయితే సాగు ఆలస్యమై ఎండతీవ్రత కారణంగానే అపరాల పంట రైతులకు దక్కడం లేదని, వరి సాగు అనంతరం మూడో పంటగా అపరాల సాగు జరగాలంటే తొలకరి సాగుకు రైతులు చొరవ చూపి సరైన సమయంలో మూడో పంట అయిన అపరాల సాగయ్యేలా చూడాలని అధికారులు చెబుతున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 52 వేల ఎకరాలు సాగుభూమి ఉండగా అందులో ఈ ఏడాది 20 శాతం పొలాల్లో రైతులు అపరాల సాగు చేశారు. కాజులూరు మండలంలోని గొల్లపాలెం, బందనపూడి, శీల, మంజేరు, కాజులూరు, అయితపూడి, కుయ్యేరు, కోలంక, పల్లిపాలెం తదితర గ్రామాల్లోనూ, కె.గంగవరం మండలంలోని పేకేరు, దంగేరు, శివల, మసకపల్లి, కుందూరు, సత్యవాడ, కోటిపల్లి, కోట తదితర గ్రామాల్లోనూ, రామచంద్రపురం మండలంలోని ఉండూరు, హసన్‌బాద, కందులపాలెం, కాపవరం, వెల్ల, తాళ్ళపొలం, ఉట్రుమిల్లి తదితర గ్రామాల్లోనూ రైతులు ఎక్కువగా అపరాల సాగు చేపట్టారు.

తెగులు నివారణకు చర్యలు చేపట్టాలి

జమినీ వైరస్ వలన ఈ తెగులు వస్తుందని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ చెబుతున్నారు. సూక్ష్మంగా ఉండే తెల్లదోమలు పల్లాకు తెగులు ఉన్న ఆకుపై వాలి మరో ఆకుపైకి వెళ్లడం వల్ల వాటి కాళ్ల ద్వారా ఈ తెగులు వ్యాపిస్తుందన్నారు. పంటపై పల్లాకు తెగులు సోకితే ఆకులన్నీ పసుపురంగులోకి మారి మొక్కలు ఆహారం తయారు చేసుకోలేవని దీంతో దిగుబడి తగ్గిపోతుందన్నారు. ముఖ్యంగా పొలంగట్లపై ఉండే కలుపు మొక్కల ద్వారా ఒక పంట నుంచి మరో పంటకు వైరస్ వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ తెగులు సోకిన కలుపు మొక్కలను అపరాల మొక్కలను ముందుగా గుర్తించి పొలం నుంచి తొలగించి తగుల బెట్టాలన్నారు. తెల్లదోమ నివారణకు ట్రైజోఫాస్ 1.25 మిల్లీలీటర్లు లేదా మోనోక్రాటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు కాని, ప్రొఫినోఫాస్ 1.5 మిల్లీలీటర్లు కాని, ఎసిఫేట్ ఒక గ్రాముకాని, ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు కాని, లీటరు నీటికి కలిపి రెండు వందల లీటర్ల మందు ద్రావణాన్ని ఎకరం పంటపై పిచికారీ చేయాలన్నారు. దోమ ఉధృతిని బట్టి 10–15 రోజుల వ్యవధిలో మందును మార్చి మరోసారి పిచికారీ చేయాలన్నారు. రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను రక్షించుకోగలిగితే మంచి ఆదాయం పొందవచ్చని వ్యవసాయాధికారి తెలిపారు.

సాగు సకాలంలో పూర్తవ్వాలి



ప్రభుత్వాధికారులు కాలువనీరు సకాలంలో అందించేలా చర్యలు తీసుకుని ఖరీఫ్, రబీ సాగులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలి. మార్చి నెలాఖరు నాటికి దాళ్వా పంట పూర్తయితే అపరాల సాగుకు వాతావరణం అనుకూలిస్తుంది.

– గోవాల కామరాజు, రైతు, గొల్లపాలెం

ఎండలకు అధిక తెగుళ్లు



ఏడాదికేడాది సాగు ఆలస్యం అవుతుండటంతో దాని ప్రభావం అపరాల సాగుపై పడుతుంది. ఎండల తీవ్రతకు తెగుళ్ల ఉధృతి ఎక్కువవుతుండటంతో అపరాలు సాగు చేసినా దిగుబడి లేక నిరుపయోగమవుతుంది.

– పెంకే సత్యనారాయణ, రైతు, కాజులూరు

విజ్ఞానంతోనే జగత్తు వికసిస్తుంది



ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేసిన నిర్వాహకులు



శిక్షణ శిబిరాల్లో ప్రతిభ కనబర్చిన చిన్నారులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న వక్తలు

కపిలేశ్వరపురం: విజ్ఞానంతోనే యావత్తూ జగత్తు వికసిస్తుందని వేసివి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి ఆధ్వర్యంలో 35 రోజులు పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు ముగింపు కార్యక్రమాన్ని పురష్కరించుకుని శిక్షణ పొందిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. సర్పంచ్ సాకా శ్రీనివాస్, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్.ఎం.వంగా శ్రీనివాస్, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ సతీష్, పాస్టర్ ఏసు రత్నం మాట్లాడుతూ చిన్ననాటి నుంచీ విజ్ఞానాన్ని సముపార్జన చేసుకున్నవారికి భవిష్యత్ మెరుగ్గా ఉంటుందన్నారు. శిక్షణా తరగతుల నిర్వహణకు సహకరించిన వారికి గ్రంథాలయాధికారి శివకుమారి కృతజ్ఞతలు తెలిపారు.

విజేతలకు బహుమతులు అందజేత

రామచంద్రపురం రూరల్: విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే ఆ అలవాటు వారిని మేధో సంపన్నులను చేస్తుందని విశ్రాంత ఇంగ్లీషు లెక్చరర్ బి.శివరాం అన్నారు. మండలంలోని ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన వేసవి శిక్షణ కార్యక్రమాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అదే విధంగా ఈ వేసవి శిక్షణ తరగతుల సందర్భంగా ఏప్రిల్ 28 నుంచి జూన్ 6 వరకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి లైబ్రేరియన్ ములంపాక వీర సూరిబాబు ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎం.సాయిరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డుకు ఎంపికైన పేద విద్యార్థి



అంగరలో ప్రతిభా అవార్డు గ్రహీత అభినయ్‌ను అభినందిస్తున్న ప్రముఖులు

కపిలేశ్వరపురం: అంగర శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో సీఈసీ విభాగం విద్యార్థి గొడితి అభినయ్ ఆంధ్రప్రదేశ్ ప్రతిభా అవార్డుకు ఎంపికయ్యాడు. పేదింటి విద్యార్థి అభినయ్ 1000కి 943 మార్కులు సాధించడం ప్రశంసనీయమని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. విద్యార్థిని కళాశాలలో శుక్రవారం తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా అభినందించారు. ఈ నెల 9న అమలాపురంలో జరగనున్న కార్యక్రమంలో మెడల్, సర్టిఫికెట్, రూ.20వేలు నగదు బహుమతి అందుకోనున్నట్లు కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వర తెలిపారు. కళాశాల ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వల్లూరు గ్రామానికి చెందిన బొడ్డు దివ్య, చింతలూరు గ్రామానికి చెందిన ఇంటి మహాలక్ష్మిలను సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ యర్రా వీరన్న, కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వర, చైర్మన్ డాక్టర్ వాకా దివ్య శేఖర్, కరస్పాండెంట్ వి.రాజా సత్కరించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు.

ఒంటికాలిపై కార్మికుల నిరసన



మండపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట ఒంటికాలిపై నిలుచుని నిరసన తెలుపుతున్న కార్మికులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట 14 రోజులుగా నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు శుక్రవారం వినూత్నంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ఒంటికాలిపై నిలుచుని నినాదాలు చేశారు. 14 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా తమ డిమాండ్లను పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం సరైందికాదని నాయకులు పాలపర్తి సుబ్బరాజు, కప్పల సురేంద్ర, టేకి వెంకన్న, పిట్టా ప్రవీణ్ కుమార్, గంటి నవీన్‌కుమార్ తదితులు అన్నారు. ఏళ్ల తరబడి పట్టణ ప్రజలకు రోజువారీ సేవలను అందిస్తున్నామని, ప్రభుత్వం మానవత్వంతో తమ డిమాండ్లను పరిష్కరించాలని నాయకులు కోరారు.

ఘనంగా గజమాల యాత్ర

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి కల్యాణం సందర్భంగా దేవస్థానం వ్యవస్థాపకుడు మొల్లేటి రామస్వామి, ఆదిలక్ష్మి దంపతుల మెడలో ఆవిష్కరించే గజమాల యాత్ర ఊరేగింపు శుక్రవారం ఘనంగా జరిగింది. రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజోలు మండలం తాటిపాక శెట్టిబలిజ సంఘం భవనం నుంచి కేరళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, యువకుల ఉత్సాహం నడుమ ప్రారంభమైన యాత్ర మామిడికుదురు బస్టాండ్ కూడలి నుంచి పాశర్లపూడి కొండాలమ్మ చింత సెంటర్ మీదుగా అప్పనపల్లి వరకు సాగింది. అప్పనపల్లి ఆలయం ప్రాంగణంలో ఉన్న రామస్వామి, ఆదిలక్ష్మి దంపతుల విగ్రహాలకు గజమాలను అలంకరించారు. శెట్టిబలిజ సంఘం యువత మోటార్ సైకిళ్ల ర్యాలీలో ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గజమాల యాత్రలో పాల్గొన్నారు. యాత్రలో మండల శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీనివాస్, సంఘం ప్రతినిధులు నయినాల కాశీ, యాండ్ర వీరబాబు, జోగి వెంకటరామకృష్ణ, నయినాల రామకృష్ణ, పెచ్చెట్టి సత్యచంద్రరావు, కడలి నూకరాజు, పితాని సురేంద్ర, రవి, పెద్దిరాజు, శ్రీనివాస్, శివరామప్రసాద్ పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు ఏదీ.. అనువైన వరి

- మూస పద్ధతుల్లోనే రైతన్న సాగు
- నూతన వంగడాలను ప్రోత్సహించాలంటున్న శాస్త్రవేత్తలు
- నిపుణుల సూచనలతో నష్ట నివారణ



నారుమడిని సిద్ధం చేసుకుంటున్న రైతులు

రాయవరం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. తొలకరి ఇంకా పలకరించక ముందే పలువురు రైతులు బోర్లపై సాగుకు సమాయత్తమవుతున్నారు. బోర్లపై సాగు చేసేవారు ఇప్పటికే నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. కాలువల ద్వారా నీరు కూడా విడుదల కావడంతో మిగిలిన రైతులు నారుమడులు సిద్ధం చేసే పనిలో పడ్డారు. ఈ సమయంలో ఖరీఫ్‌కు అనువైన వరివిత్తనాల వివరాలను రైతులు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

క్లస్టర్‌లో పరిస్థితి ఇదీ

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పంట తెగుళ్లు, వైపరీత్యాలను తట్టుకుని నిలిచే ఆధునిక వంగడాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు అందుబాటులోకి తెస్తున్నా రైతులు కాలం చెల్లిన వాటినే సాగు చేయడం పరిపాటిగా మారింది. తొలకరిలో సుమారుగా 85శాతం విస్తీర్ణంలో స్వర్ణ రకాన్ని సాగు చేస్తుండగా, మిగవిలిన విస్తీర్ణంలో ఇతర రకాలను సాగు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలను, తుపాన్లను తట్టుకుని నిలవలేకపోతుంది. స్వర్ణకు ప్రత్యామ్నాయంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎంటీయు 1318 రకాన్ని రూపొందించారు.

ఎంటీయూ 7029 (స్వర్ణ)

అధిక సంఖ్యలో రైతులు సాగు చేసేది స్వర్ణ రకాన్నే. ఇంచుమించుగా 85శాతం మంది రైతులు ఎక్కువగా ఖరీఫ్‌లో ఈ రకాన్నే సాగు చేస్తున్నారు. స్వర్ణ 155 రోజులకు కోతకు వస్తుంది. ఎక్కువగా గాలికి, వర్షానికి పడిపోయే స్వభావంతో పాటు తెగుళ్లను అంతగా తట్టుకోక పోయినా..ఇది ఎటువంటి పరిస్థితుల్లోనైనా దిగుబడి బాగా ఇస్తుంది. అందుకే రైతులు ఎక్కువగా దీని వైపు మొగ్గు చూపుతున్నారు. స్వర్ణ ఎకరాకు 30–35 బస్తాల దిగుబడి వస్తుంది. రైతులు స్వర్ణ రకాన్ని దిగుబడిలో బంగారంగా పేర్కొంటారు.



స్వర్ణ రకం వరి



ఎంటీయూ 1,318 వరి

ఎంటీయూ1318

సార్వాలో స్వర్ణకు ప్రత్యామ్నాయంగా దీనిని మార్టేరు వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్తలు రూపొందించారు. ఇది నూతన వరి వంగడం. దీని పంట కాలం 155–160 రోజులు. స్వర్ణకు ప్రత్యామ్నాయం. తెగుళ్లను ధీటుగా తట్టుకుంటుంది. ముఖ్యంగా పాము పొడ తెగులు, దోమపోటు, అగ్గి తెగులును తట్టుకోవడమే కాకుండా ప్రకతి వైపరీత్యాల సమయంలో గాలులకు ఒరిగిపోకుండా అధిక దిగుబడులనిస్తుంది. నీటి వసతి అధికంగా ఉన్న ప్రాంతాల రైతులు ఈ వరి వంగడాన్ని సాగు చేయాలి. ముంపు ప్రాంతాలకు ఇది అనువైన రకం.

బీపీటీ 5204 (సాంబ మసూరి)

సాంబ మసూరి పంట కాలం 155 నుంచి 160 రోజులు. ఇది సన్నరకం ఫైన్ క్వాలిటీ. మన ప్రాంతంలో రైతులు ఎక్కువగా వారి తిండి అవసరాల కోసం దీన్ని పండిస్తారు. దీనికి బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. అందుకే రైతులు ఎక్కువగా దీన్ని సాగు చేయడం లేదు.

ఎంటీయూ 1061 (ఇంద్ర)

స్వర్ణ రకం మాదిరిగానే 150 నుంచి 155 రోజుల్లో పంటకు వస్తుంది. ముంపు ప్రాంతాలైన బాడవల్లో దీన్ని సాగు చేసుకోవచ్చు. ఎందుకంటే ఎక్కువ రోజులు నీటిలో ఉన్నా పంటకు నష్టం ఉండదు. వర్షాలకు, గాలికి పడిపోయే గుణం తక్కువ. స్వర్ణకు ప్రత్యామ్నాయంగా దీన్ని సాగు చేసుకుంటే మంచిది.

ఎంటీయూ 1064

తొలకరిలో స్వర్ణకు ప్రత్యామ్నాయంగా తయారు చేసిన రకం. పంట కాలం 145 నుంచి 150 రోజులు. ఎకరాకు 25 నుంచి 30 బస్తాల దిగుబడి వస్తుంది. స్వర్ణకు దీటుగా దిగుబడిని ఇవ్వడం లేదనే కారణంతో రైతులు ఎక్కువగా ఆసక్తి చూపడం లేదు. ముంపు ప్రాంతాలకు కూడా ఇది అనువైన రకం.

ఎంటీయూ 1075

ఈ వరి ఎక్కువ పొడవుగా ఎదుగుతుంది. పడిపోయే గుణం తక్కువ. దీని పంట కాలం 145 నుంచి 150 రోజులు. దిగుబడి ఎకరాకు 25 నుంచి 28 బస్తాల వరకు దిగుబడి వస్తుంది.

ఎంటీయూ 1121

ఇది ఫైన్ క్వాలిటీ సన్నరకం. దీని పంట కాలం 150రోజులు. ఇది కొంత వరకు దోమను తట్టుకుంటుంది. ఎకరాకు 30 నుంచి 35 బస్తాల దిగుబడి వస్తుంది.

ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలి



రైతులు మూస పద్ధతులను పాటించకుండా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాలి. తుపాన్‌లు, ఈదురుగాలులను తట్టుకునే శక్తి స్వర్ణ రకానికి లేదు. స్వర్ణ వరి వంగడానికి ప్రత్యామ్నాయ రకాలను కూడా సాగు చేయాలి.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం.

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): మానవ సమాజంలో త్యాగమయ జీవన విధానాన్ని అలవర్చే పండగ బక్రీద్ అని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. బక్రీద్ సందర్భంగా ముస్లింలందరికీ ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, భక్తి, సామాజిక సామరస్యాలను సూచించే పవిత్ర పండగ వేళ అందరికీ మంచి జరగాలని ఆశిస్తున్నట్టు ఎమ్మెల్సీ తోట అన్నారు.

ముస్లిం సోదరులకు చైర్‌పర్సన్ బక్రీద్ శుభాకాంక్షలు

కపిలేశ్వరపురం (మండపేట): నేడు బక్రీద్ పండుగను పురస్కరించుకుని మండపేట పట్టణంలోని ముస్లిం మతస్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి శుక్రవారం బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. సమతా, మమతలకు ప్రతీకగా బక్రీద్ జరుపుకోవాలని దుర్గారాణి ఆకాంక్షించారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా ‘పోలినాటి’



వరప్రసాద్

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా వెల్ల గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పోలినాటి వరప్రసాద్ నియమితులయ్యా రు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎత్తి చూపుతూ పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని పోలినాటి తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడిగా తనను నియమించిన పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. పోలినాటి వరప్రసాద్‌ను ఎంపీ బోస్, కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

ఘనంగా కుంతీదేవి జాతర

కె.గంగవరం: మండలంలోని తామరపల్లిలో కొలువైన కుంతీదేవి అమ్మవారి జాతర మహోత్సవాన్ని గ్రామస్తులు, కమిటీ సభ్యులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారితో పాటు ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. జాతర సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా యువజన అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్, ఎంపీపీ పంపన నాగమణి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, మాజీ ఎంపీపీ పెట్టా శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకున్నారు.

రాష్ట్రంలో వింత పాలన



న్యాయవాది జొన్నపల్లి

కపిలేశ్వరపురం (మండపేట): రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని న్యాయవాది, ఆలమూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జొన్నపల్లి సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, కేబినెట్, ప్రధాన కార్యదర్శికీ తెలియకుండానే ప్రభుత్వం తరపున జీవోలు విడుదల వ్వడమనే వింత పాలన సాగుతుందన్నారు. ప్రభుత్వ జీవోలు నియమ నిబంధనలు మేరకు రూపొందించాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు చెడ్డపేరు తెచ్చేలా కొందరు కుట్రలు పన్నుతున్నారని న్యాయవాది జొన్నపల్లి సత్యనారాయణ అభిప్రాయపడ్డారు.

యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం

కపిలేశ్వరపురం: యోగాసనాలతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని యోగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం యోగాసనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాకా శ్రీనివాస్, అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు పర్యవేక్షించారు. పలు పాఠశాలల పీఈటీలు ముత్తా సత్యనారాయణ, మేకా సత్యనారా యణలు గ్రామస్తులచే యోగాసనాలు వేయించారు. శిక్షకులు మాట్లాడుతూ రోజువారీ జీవితంలో యోగా ఒక జీవన విధానంగా మారాలని ఉద్బోధించారు.

మండపేటలో జాబ్‌మేళా

కపిలేశ్వరపురం (మండపేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిచారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ యువతీ యువకులు తమ శక్తి సామర్థ్యాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలను ఒడిసిపట్టుకోవాలన్నారు. ఈ జాబ్‌మేళాలో 11 ప్రముఖ కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరవ్వయ్యి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మేళాకు 206 మంది యువత హాజరయ్యారు. వారిలో 94 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యనట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరిశేషు తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీకేవీశ్రీనివాసరావు, ఏపీఎస్ఎస్‌డీసీ సిబ్బంది, సీడప్ సిబ్బంది పాల్గొన్నారు.